క్లుప్తంగా

కంగ్టికి నైట్‌హాల్ట్ బస్సు పునరుద్ధరణ

కంగ్టి(నారాయణఖేడ్): మండల కేంద్రమైన కంగ్టికి ఏళ్ల తరబడి నైట్‌హాల్ట్ బస్సు లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వారి విజ్ఞప్తి మేరకు గురువారం నుంచి ఆర్టీసీ బస్సు సర్వీస్ పునరుద్ధరిస్తున్నట్లు నారాయణఖేడ్ డీఎం మల్లేషయ్య తెలిపారు. ఖేడ్ నుంచి కంగ్టికి వచ్చి మర్నాడు ఉదయం ఖేడ్ మీదుగా లింగంపల్లి వరకు బస్సు సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఆర్టీసీ బస్సులో సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు. బస్సు సర్వీసు పునరుద్ధరించడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ బస్ డిపో సందర్శించిన ఆర్‌ఎం

జహీరాబాద్: స్థానిక ఆర్టీసీ బస్ డిపోను గురువారం రీజినల్ మేనేజర్ విజయ్ భాస్కర్ సందర్శించారు. ఈ సందర్భంగా డిపోలోని అన్ని విభాగాలను పరిశీలించారు. సిబ్బంది పనితీరును సమీక్షించి సూచనలు చేశారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కలు నాటారు. సిబ్బందితో గేట్ మీటింగ్ నిర్వహించారు. సమష్టిగా పనిచేసి సంస్థ అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ స్వామి, అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

సోయాబీన్ విత్తనాల పంపిణీ

జహీరాబాద్: డీడీఎస్–కేవీకే ఆధ్వర్యంలో రైతులకు సోయాబీన్ విత్తనాలు పంపిణీ చేశారు. గురువారం మండలంలోని కొత్తూర్(బి), బూర్దిపాడ్, తూంకుంట, సత్వార్, హుగ్గెల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులకు సోయాబీన్ డీఎస్‌బీ–34 రకం విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు స్నేహలత, రైతులు పాల్గొన్నారు.

ప్రహరీని తొలగించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఈదులనాగులపల్లిలో గురువారం అధికారులు భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కొల్లూరు నుంచి మోకిల వెళ్లే రేడియల్ రోడ్డును అనుకుని ప్రహరి నిర్మిస్తున్నారని దానిని అడ్డుకోవాలని కోరుతూ గ్రామస్తులు తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డికు వినతిపత్రం అందజేశారు. దీనిపై జిల్లా ఉన్నత అధికారులు విచారణ చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా గ్రామ పరిధిలో అనేక నిర్మాణాలను చేస్తున్నారని తెలిపారు.

వార్డుల కేటాయింపుపై అభ్యంతరం



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): వార్డుల విభజన సక్రమంగా జరగలేదంటూ గుమ్మడిదల మున్సిపాలిటీ అఖిలపక్ష నాయకులు అధికారులను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. నగర విస్తరణలో భాగంగా ప్రభుత్వం నూతన మున్సిపాలిటీలు ఏర్పాటు చేసింది. గుమ్మడిదల మున్సిపాలిటీకి సంబంధించి వార్డుల కేటాయింపులు సరైన క్రమంలో చేయలేదని స్థానిక నాయకులు అసహనం వ్యక్తం చేశారు. మరోసారి అధికార యంత్రాంగం వార్డుల విభజన ప్రక్రియను వరుస క్రమంలో చేపట్టాలని కమిషనర్ రఘుకు అఖిలపక్ష నాయకులు వినతిపత్రం అందజేశారు.

ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమ ఆఫీస్ బేరర్ల నియామకం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమలో ఇటీవల జరిగిన కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మిక పోరాట సమితి విజయం సాధించిన విషయం విదితమే. ఈ మేరకు గురువారం యూనియన్ ఆఫీస్ బేరర్ల నియామకాన్ని చేపట్టారు. ప్రెసిడెంట్‌గా కొత్తగొల్ల చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా నారాయణ, వైస్ ప్రెసిడెంట్లుగా విష్ణువర్ధన్‌రెడ్డి, కృష్ణ,విఠల్, జనరల్ సెక్రటరీగా మల్లేశం, జాయింట్ సెక్రెటరీలుగా శ్రీనివాస్‌రాజు, గురు కిరణ్, వెంకట్ రావు, వీరన్న, ఆర్గనైజింగ్ సత్యనారాయణ రెడ్డి, జైపాల్, నర్సింలు, ట్రెజరర్‌గా రాచయ్య స్వామి,జాయింట్ ట్రెజరర్‌గా నజీర్ లను నియమించారు.

ఎమ్మెల్యేను కలిసిన నూతన కమిటీ

పటాన్‌చెరుటౌన్: పటాన్‌చెరు జేపీ కాలనీలోని పంచముఖ వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ నూతన కార్యవర్గం సభ్యులు గురువారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశా రు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు విరుపాక్ష చంద్రశేఖర్ శ్రీనివాస్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సుక్కల్ తీర్థ్.. పనులు వేగవంతం

పెరగనున్న 300 ఎకరాల ఆయకట్టు

- చివరి దశకు చేరుకున్న నిర్మాణ పనులు
- 2021లో రూ.14.47 కోట్లతో పనులు మంజూరు
- సుక్కల్‌తీర్థ్, గాజుల్‌పాడ్, రాసోల్ గ్రామాల రైతులకు లబ్ధి



సుక్కల్‌తీర్థ్ కొత్త చెరువు నిర్మాణంలో భాగంగా కట్ట తూము నిర్మాణం పనులు



విజయ్‌భాస్కర్ డీఈఈ, ఇరిగేషన్, నారాయణఖేడ్

కంగ్టి(నారాయణ ఖేడ్): నీటి బొట్టును ఒడిసి పట్టి రైతుల సాగు భూములకు నీరందించేందుకు గత ప్రభుత్వ హయాంలో మంజూరైన సుక్కల్‌తీర్థ్ కొత్త చెరువు నిర్మాణ పనులు చక చకా కొనసాగుతున్నాయి. దీంతో మండలంలో మరో 300 ఎకరాల మేర ఆయకట్టు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని సాగునీటి పారుదల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంలో చెరువుల అభివృద్ధిలో భాగంగా చెరువుల్లో పూడికతీత, కట్ట ఎత్తు పెంపు, అలుగుల నిర్మాణం, తూముల వద్ద మరమ్మతులు, కాల్వల నిర్మాణ పనులు, అక్విడెట్లు ఏర్పాటు తదితర పనులు చేపట్టారు. దీంతో పాటు ఆయా గ్రామాల్లో కుంటలకు సైతం నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేశారు.

చెరువు నిర్మాణానికి రూ. 14.47 కోట్లు మంజూరు సుక్కల్‌తీర్థ్ చెరువు నిర్మాణానికి రూ.14.47 కోట్లు ఆగస్టు 2021లో గత ప్రభుత్వం మంజూరు చేస్తూ జీఓ జారీ చేసింది. మండలంలోని రాసోల్, సుక్కల్‌తీర్థ్, గాజుల్‌పాడ్ గ్రామాల శివారులోని దాదాపు 300 ఎకరాల ఆయకట్టు సాగుతో రైతులకు లబ్ధి చేకూరనున్నట్లు అంచనా వేశారు. అందుకు గాను చెరువుకట్ట ఎత్తు, పొడువు, తూముల నిర్మాణం ప్రణాళికతో నిర్మిస్తున్నారు. అందుకు చెరువుకు రెండు ప్రధాన తూములు నిర్మిస్తున్నారు. ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం 16 ఎంసీఎఫ్‌టీలు ఉంటుందని ఇంజినీర్లు అంచనా వేశారు.

ప్రాజెక్టు భౌగోళిక విస్తీర్ణం

కొత్త చెరువు నిర్మాణానికి వర్షపు నీటి పరివాహక ప్రాంతం 28.81 చదరపు కిలోమీటర్లు ఉంది. పూర్తి స్థాయిలో నీరు నిండితే చెరువులోని నీటితో 26 ఎకరాల విస్తీర్ణం ముంపునకు గురవుతుంది. చెరువు కట్ట 360 మీటర్ల పొడవుతో నిర్మాణం చేస్తున్నారు. చెరువు అలుగు 100 మీటర్ల పొడువు ఉంది. ఇంతటి సామర్థ్యంతో నిర్మాణమైన చెరువు అలుగు అదనపు నీరు దిగువన ఉన్న కాకివాగు ప్రాజెక్టులో చేరుతుంది. ప్రస్తుతం వర్షాకాల సీజన్ పూర్తయిన తర్వాత కాల్వల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. రెండు ప్రధాన తూముల ద్వారా నీటి కాల్వలు కుడి కాల్వ 4.8 కిలో మీటర్లు, ఎడమ కాల్వ 3.9 కిలోమీటర్లుగా అంచనా వేసినట్లు అధికారులు తెలిపారు.



మట్టి నాణ్యత, గట్టిదనం పరీక్షలు చేస్తున్న అధికారులు

జులై చివరి వరకు పనులు పూర్తి

వచ్చే రెండు నెలల్లో ప్రాజెక్టు నిర్మాణం పనులు పూర్తి చేస్తాం. క్వాలిటీ పరీక్షల కోసం ల్యాబ్ ఏర్పాటు చేశాం. కంప్రెషర్ మిషన్‌తో పరీక్షలు నిర్వహిస్తూ నిర్మాణం పనులు చేస్తున్నాం. సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ ప్రకారం నిర్మాణం జరుగుతోంది. క్వాలిటీ కంట్రోల్ వింగ్ పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. ఎస్‌ఈ, ఈఈలు తరుచుగా సందర్శిస్తున్నారు. నాతో పాటు ఏఈలు, సిబ్బంది రెగ్యులర్‌గా పర్యవేక్షణ ఉంది.

ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి



పర్యావరణ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి జోన్: ప్రతీ ఒక్కరు ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్‌ఓ పద్మజారాణి సూచించారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డిలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు అదనపు కలెక్టర్‌తో కలిసి అవగాహన ర్యాలీని నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో చంద్రశేఖర్, పద్మజారాణి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, జ్యూట్ బ్యాగులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన చిత్రకళ, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్ గీత, గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకట నాగేంద్ర, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి నష్టం

నారాయణఖేడ్: ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి తీరని నష్టం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం ఖేడ్‌లోని పలు వార్డులలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల అనేక అనారోగ్య సమస్యలు కలుగుతాయని, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌కు బదులు చేతిసంచులు వాడాలని సూచించారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, మాజీ కౌన్సిల్ సంధ్యారాణి, రామకృష్ణ, తాహెర్, శంకర్ ముదిరాజ్ పాల్గొన్నారు. అనంతరం వాగు పరిసరాల్లో ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి చెత్త తొలగింపు పనులు చేపట్టారు.

చెరువులను పరిరక్షించుకుందాం

పటాన్‌చెరుటౌన్: చెరువుల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని బతుకమ్మ చెరువులో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి మొక్కలను నాటారు. అనంతరం పలు దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఇస్నాపూర్ మున్సిపల్ సిబ్బంది ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందించిన డీఆర్‌ఓ

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ, డీఈ సత్యనారాయణ, ఏఈ మౌనిక, ఆర్‌ఓ వెంకటరామయ్య, మేనేజర్ అఖిల్‌లు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు మొక్కలు నాటండి

పటాన్‌చెరు టౌన్: కాలుష్య నివారణకు మొక్కలను నాటాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, ఎకో క్లబ్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 'భారత ప్రభుత్వం... ప్రతి ఇంటి ముందు అమ్మ పేరిట ఒక మొక్క' అనే నినాదాన్ని దృష్టిలో ఉంచుకొని మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో కళా శాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకటేశం, కరుణా కుమారి, ఎకో క్లబ్ కన్వీనర్ డాక్టర్ మల్లిక, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌పై యుద్ధం చేద్దాం

పటాన్‌చెరు: ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించుకోవడంలో భాగస్వామ్యం అవ్వాలని ప్రపంచ పర్యావరణ పరిరక్షణ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ భద్ర పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కన్వీనర్ డాక్టర్ కస్తూరి శ్రీనివాస్, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు అడ్వకేట్ భార్గవ్ కుమార్ ఆధ్వర్యంలో లక్డారం గ్రామంలో గురువారం మొక్కలను నాటారు.

సవాళ్లను ఎదుర్కొనే 'నెక్ట్స్‌జెన్ లీడర్స్'

ఏరీస్ ఆగ్రో లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ జయ ప్రదీప్

పటాన్‌చెరు: భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన నాయకత్వ నైపుణ్యాలు, వ్యూహాత్మక సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఏర్పాటైన ‘నెక్ట్స్‌జెన్ లీడర్స్’ మొదటి సమావేశంలో పాల్గొనడం సంతోషంగా ఉందని ఏరీస్ ఆగ్రో లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ జయ ప్రదీప్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. భారత మైక్రో ఫెర్టిలైజర్స్ మాన్యుఫాక్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెల 27 నుంచి 31 వరకు అహ్మదాబాద్‌లో నిర్వహించిన నెక్స్ జెన్ లీడర్స్ సమావేశానికి హాజరైనట్లు తెలిపారు. గురువారం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో ఏరీస్ అగ్రో లిమిటెడ్ పరిశ్రమలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...తనతో పాటు వేణు మాధవ్,రాకేశ్,సుధీర్,రాజేష్‌లు కూడా హాజరయ్యారన్నారు. నాయకత్వ నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు, తమ సంస్థకు, మైక్రోఫెర్టిలైజర్స్ పరిశ్రమకు ప్రభావవంతమైన నాయకుడిగా ఎదిగేందుకు అనుకూలంగా నెక్ట్స్‌జెన్ లీడర్స్ సమావేశం సహాయపడుతుందని తెలిపారు.



సర్టిఫికెట్‌లతో ఏరీస్ అగ్రో లిమిటెడ్ పరిశ్రమ ప్రతినిధులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



హత్నూర మండలం దేవులపల్లిలో మొక్కలు నాటుతున్న శంకర్



మొక్క నాటుతున్న హెటిరో పరిశ్రమ ప్రతినిధులు

కంది(సంగారెడ్డి): పర్యావరణాన్ని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన కందిలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ..ప్రస్తుతం గాలి, నీరు, నేల కలుషితమై వాతావరణం దెబ్బతిని మానవ మనుగడకే ప్రమాదం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేందర్ రెడ్డి,కంది ఈవో కవిత, బిల్ కలెక్టర్లు మల్లేశం,వీర్రాజు పాల్గొన్నారు.

హత్నూర(సంగారెడ్డి)...

హత్నూర(సంగారెడ్డి): పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతని ఎంపీడీవో శంకర్ పేర్కొన్నారు. హత్నూర మండలం దేవులపల్లి గ్రామంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఎంపీడీవో శంకర్ గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...భవిష్యత్తులో పర్యావరణాన్ని రక్షించేందుకు ప్రస్తుతం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడితే ప్రజలను ప్రకృతి కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ ప్రవీణ్ కుమార్, గ్రామపంచాయతీ కార్యదర్శితోపాటు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

పర్యావరణమే ప్రాణవాయువు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ రైజింగ్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ రఘు సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం నగర పరిధిలో స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడిదలలో..

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని హెటిరో పరిశ్రమ ప్రతినిధులు మల్లికార్జున్‌రెడ్డి, రవిబాబు అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం గడ్డపోతారం పారిశ్రామికవాడలో సుమారు 340 మొక్కలను సిబ్బందితో కలిసి నాటారు. మొక్కలు నాటి వదిలేయకుండా నాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ సిబ్బంది, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ఒక్క ఓటుతో సీఐటీయూ గెలుపు

మహీంద్రా కార్మిక సంఘం ఎన్నికల్లో విజయం

జహీరాబాద్: జహీరాబాద్‌లోని మహీంద్ర అండ్ మహీంద్రా కర్మాగారంలో జరిగిన కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూ ఒక్క ఓటుతో గట్టెక్కింది. గురువారం నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షపదవి కోసం అధికార సీఐటీయూ, ఐఎన్‌టీయూసీలు పోటీ పడ్డాయి. కర్మాగారంలో 543 మంది కార్మికులు ఉండగా 439 ఓట్లు పోలయ్యాయి. సీఐటీయూ యూనియన్‌కు 270 ఓట్లు రాగా, ఐఎన్‌టీయూసీకి 269 ఓట్లు పోలయ్యాయి. ఉత్కంఠ పోరులో సీఐటీయూ ఒక్క ఓటు తేడాతో విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో సీఐటీయూ కర్మాగారంలో వరుసగా నాలుగవ విజయాన్ని నమోదు చేసింది. ఐఎన్‌టీయూసీ తరఫున యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జనక్‌ప్రసాద్ పోటీచేశారు. కార్మిక సంఘం అధ్యక్షుడిగా ఎన్నికై న చుక్కా రాములు మాట్లాడుతూ కార్మికులకు నిజాయితీగా తమ సేవలను అందించడంతోనే తనను గెలిపించారన్నారు. ఈ గెలుపు మరింత బాధ్యత పెంచిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మల్లేష్, మహిపాల్, సాయిలు, రాజిరెడ్డి, మాణిక్, నరేష్ పాల్గొన్నారు.



కార్మికులతో కలిసి సంబరాలు జరుపుకుంటున్న చుక్కా రాములు

చుక్కా రాములు సంబరాలు

కార్మిక సంఘం అధ్యక్షుడిగా గెలుపొందిన చుక్కా రాములు కర్మాగారం ఆవరణలో కార్మికులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరుటౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు జిల్లా కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ మాట్లాడుతూ.. బుధవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో నలుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా నలుగురికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

నేటి నుంచి ప్రతిష్ఠాపన ఉత్సవాలు

నారాయణఖేడ్: పట్టణ శివార్లలోని మనూరు క్రాస్ రోడ్ వద్ద నూతనంగా నిర్మించిన లలితాంబిక దేవి ఆలయంలో ఈనెల 6 నుంచి 8 వరకు ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు దేవి ఉపాసకులు శివపంతులు తెలిపారు. 6న పుణ్యవచనం, యాగశాల ప్రవేశం, అగ్ని స్థాపన, 7న వేదమంత్ర పారాయణం, గణపతిపూజ, 8న దేవి ప్రతిష్ఠ యాగ మహోత్సవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. వివిధ మఠాల పీఠాధిపతులు అవదూత్‌గిరి మహారాజ్, సోమలింగ శివాచార్య, సంగ్రాం మహారాజ్, కరణ్ గజేంద్ర భారతి మహారాజ్, కాశీనాథ్ బాబా, దేవగిరి మహారాజ్, అంబాదాస్ మహారాజ్ పాల్గొననున్నట్లు తెలిపారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

నారాయణఖేడ్: పట్టణంలో శ్రీరామసేన ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంఘం నాయకులు సతీష్, విఠల్, దశరత్, దత్తు, మోహన్, అక్షయ పాటిల్, మధుసూదన్, మయాంక్‌రాజ్‌పుత్ తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ప్రధాని మోడీకి మద్దతుగా భరతమాత సేవలో యుద్ధభూమిలో మరణించిన భారత జవాన్ల స్మారకార్థం ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఖేడ్ ప్రభుత్వాస్పత్రిలో ఉదయం శిబిరం ప్రారంభం అవుతుందని, యువకులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

న్యాల్‌కల్ తహసీల్దార్‌గా ప్రభులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల తహసీల్దార్‌గా ప్రభులు నియమితులయ్యారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన భూపాల్ ఇటీవల ఇతర ప్రాంతానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బదిలీపై వచ్చిన ప్రభులు గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం మండల పరిధిలోని రత్నాపూర్‌లో నిర్వహించిన భూభారతి సదస్సులో పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

మునిపల్లి(అందోల్): తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమైనట్లు బుదేరా మహిళ డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపాల్ మాధవి తెలిపారు. 2025–26 సంవత్సరానికి సంబంధించి బీకాం, బీబీఏ, ఇంగ్లిష్ మీడియం డిగ్రీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. బీకాం, జనరల్ ఆనర్స్, బీఏ, ట్యాక్సేషన్, బీఏ ప్రవేశాల కోరకు అర్హత కలిగిన మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియెట్ బోర్డు, గుర్తింపు బోర్డుల ద్వారా నిర్వహించిన ఇంటర్మీడియెట్ పరీక్ష 2025లో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల అభ్యర్థుల తల్లిదండ్రులు వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు మించరాదన్నారు.

ఖాజిపల్లి సమస్యలు పరిష్కరించాలని ఎంపీకి వినతి

జిన్నారం (పటాన్‌చెరు): ఖాజిపల్లి సమస్యలుపరిష్కరించాలని కోరుతూ ఆర్‌కే ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ దండే రమాకాంత్ ఆధ్వర్యంలో గ్రామస్తులు గురువారం మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రమాకాంత్ మాట్లాడుతూ..పారిశ్రామిక ప్రాంతమైన ఖాజిపల్లి గ్రామంలో రోడ్లు అధ్వానంగా మారాయని, పురాతన ఆలయం, తాగునీరు, గండిచెరువు ఎఫ్‌టీఎల్ తగ్గింపు వంటి పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. గ్రామంలోని పెద్దమ్మ ఆలయం నుంచి శివాలయం, నరసింహస్వామి ఆలయం వరకు రోడ్డును మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎంపీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సత్యనారాయణ, నవీన్, మాజీ ఎంపీటీసీ భార్గవ్, నాయకులు వీణాచారి, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న ఖాజిపల్లి గ్రామస్తులు

భూ భారతిని సద్వినియోగం చేసుకోవాలి



రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలో మూడోరోజు భూ భారతి రెవెన్యూ సదస్సులు నాగుర్(కే), జమ్గి(కే) గ్రామాల్లో నిర్వహించారు. ఎంపల్లి నిర్జన రెవెన్యూ గ్రామానికి చెందిన రైతుల సమస్యలు జమ్గి(కే)లో స్వీకరించినట్లు తహసీల్దార్ భాస్కర్ పేర్కొన్నారు. నాగుర్(కే)లో డిప్యూటీ తహసీల్దార్ మహ్మద్ ముగ్ని బృందం సదస్సు నిర్వహించారు. కాగా శుక్రవారం ముర్కుంజాల్, నాగుర్(బీ) గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గిర్దవార్‌లు మల్లేశ్వర్‌రెడ్డి, తాజోద్దీన్, సర్వేయర్ మల్లేష్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భూభారతితో భూసమస్యలు పరిష్కారం

జిన్నారం (పటాన్‌చెరు): మండలంలో భూభారతి సదస్సులు మూడోరోజు కొనసాగుతున్నాయి. గురువారం జంగంపేట, వావిలాల గ్రామాలోని సదస్సులు నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూసమస్యలు భూభారతి సదస్సుతో పరిష్కరించబడతాయని తెలిపారు. వావిలాల సదస్సులో 52 అర్జీలు, జంగంపేటలో రైతుల నుంచి 19 అర్జీలు అందినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

సీడీసీ చైర్మన్ రాంరెడ్డి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని సీడీసీ చైర్మన్ రాంరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మాచిరెడ్డిపల్లి,ముబారక్ పూర్,గొల్లగూడెం, ఆరూర్ గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను గురువారం ముగ్గుపోసి ప్రారంభించారు. అదేవిధంగా ఆరూర్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ సరస్వతితో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామన్నారు. ఇళ్లు మంజూరు అయినవారు ఆలస్యం చేయకుండా పనులు ప్రారంభించాలని సూచించారు. దసరాలోపు నిర్మాణాలు పూర్తిచేసి గృహప్రవేశాలు చేయాలన్నారు. ఇంటి నిర్మాణానికి విడతల వారీగా డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని,దళారులను ఆశ్రయించ వద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన్న, మాజీ పీఏసీఎస్ చైర్మన్ మాణిక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న రాంరెడ్డి, తదితరులు

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టండి

నారాయణఖేడ్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు త్వరితగతిన పనులు చేపట్టాలని నిజాంపేట్ ఎంపీడీఓ సంగ్రాం తెలిపారు. నిజాంపేట్ మండలం దామర్ చెరులో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు పక్కా ఇంటి కల ఇందిరమ్మ పథకం ద్వారా తీరనుందన్నారు. అనంతరం నిజాంపేట్ మండల కేంద్రంలోని మండల పరిషత్ ఆవరణలో పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని అధికారులతో కలిసి సామూహికంగా 50 మొక్కలను నాటారు.